సాక్షి మంచిర్యాల

బుధవారం : 3 : జనవరి : 2024



రేషన్ అక్రమదందాకు చెక్

తినడానికి యోగ్యంగా లేకపోవడంతో లబ్ధిదారులు రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారు. డీలర్లు, దళారులు కొని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



ఆరు గ్యారంటీలు అద్భుతమైనవి

ఆరు గ్యారంటీలు నిరుపేదలకు మేలు చేస్తాయని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. అర్హులంతా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 17.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలితీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు సావిత్రీబాయి పూలే అవార్డుల పంపిణీ

పాతమంచిర్యాల: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు బీసీ జాగృతి ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక, విద్యారంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్‌గౌడ్ పేర్కొన్నారు.

నాలుగోరోజు 46,705 దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజాపాలన ఐదు గ్యారంటీలకు దరఖాస్తు ప్రక్రియలో భాగంగా నాలుగోరోజు మంగళవారం అధికారులు 46,705 దరఖాస్తులు స్వీకరించారు. 16 మండలాల్లో 45, ఏడు మున్సి పాలిటీల్లో 174 కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,60,145 దరఖాస్తులు అందాయి.

నిలిచిన కోవిడ్ టెస్టులు



కిట్లు లేక మూసివేసిన ఆర్టీపీసీఆర్ ల్యాబ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో మూడురోజులుగా కోవిడ్ నిర్ధారణ కోసం చేసే రాపిడ్ టెస్టులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిలిపివేశారు. టెస్టుల కోసం అవసరమైన కిట్లు గడువు తీరిపోవడం, కొత్తవి సరఫరా కాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోగల ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌ను టెస్ట్ కిట్లు లేక మూసివేశారు. దీంతో అనుమానితులకు కరోనా నిర్ధారణ పరీక్షలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడం గమనార్హం.

6నుంచి సాగునీటి విడుదల

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగికి ఈ నెల 6వ తేదీ నుంచి సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ బీ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఆర్డీవో రాములతో కలిసి నీటి పారుదలశాఖ అధికారులు, ఇంజినీర్లు, తహసీలార్లు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాసంగి సాగుకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్, గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలోని దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని 15 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ నెల 6నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. 90 రోజుల ఆరుతడి పంటలకు సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులు, బావులు నింపనున్నట్లు తెలిపారు. సాగునీరు, విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. వారబందీ పద్ధతిలో ఏప్రిల్ 15వరకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం ఈఈ కే దశరథం, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ డిప్యూటీఈఈ బుచ్చిబాబు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాంతయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో 'క్యూ'



జన్నారం బంకులో క్యూ కట్టిన వాహనదారులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం: లారీలు, ట్యాంకర్ల యజమానులు సమ్మె చేయనున్నట్లు ప్రచారం జరగడంతో పెట్రోల్, డీజిల్ దొరకదనే వదంతులు జిల్లాలోని పలుచోట్ల వ్యాపించాయి. దీంతో మంగళవారం జిల్లా కేంద్రంలో వాహనదారులు బంకుల్లో క్యూ కట్టి పెట్రోల్, డీజిల్ పోయించుకున్నారు. ఆ తర్వాత సమ్మె విరమించారంటూ ప్రచారం జరిగినా బంకుల్లో రద్దీ తగ్గలేదు. జన్నారంలోని రెండు బంకుల్లో నోస్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో తెరిచి ఉన్న బంకులకు క్యూ కట్టారు.



రద్దీగా జిల్లా కేంద్రంలోని ఓ బంక్

ఇసుక దొంగలు దొరికేనా?



కోటపల్లి మండలం కొల్లూరు క్వారీలో జేసీబీతో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

- బీఆర్‌ఎస్ సర్కార్ పట్టించుకోని వైనం
- ఎన్నికల ముందు నిబంధనలకు పాతర
- తవ్వినాకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాలు
- కాంగ్రెస్ పాలనలో అక్రమదందా ఆగేనా?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరినది పరీవాహక ప్రాంతాల నుంచి గత సర్కారు హయాంలో సాగించిన ఇసుక దందాపై ఆరోపణలు వెల్లువెత్తున్న నేపథ్యంలో కొత్త సర్కారులో విచారణ సాగుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాంగ్రెస్ నాయకులే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోదావరి రీచ్‌ల్లో ఇసుక మాఫియా సాగుతోందని అనేకసార్లు విమర్శలు గుప్పించారు. జిల్లా పరిధిలో అధికారిక ఇసుక రీచ్‌ల్లో వందల టన్నుల ఇసుక పక్కదారి పట్టినట్లు ఆరోపణలున్నాయి. గత సర్కారులో కొందరు ప్రజాప్రతినిధులే ఈ దందాలో పాలుపంచుకోవడంతో అడ్డూఅదుపు లేకుండాపోయిందనే ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం జిల్లా పరిధిలో ఏ రీచ్ అధికారికంగా కొనసాగడం లేదు. స్థానిక అవసరాల కోసం కూడా అనుమతులు రాలేదు. ఈ క్రమంలో జిల్లావాసులకే స్థానిక అవసరాల కోసం ఇసుక దొరకక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ల గడవు ముగియడం, ఇసుక అనుమతులు పూర్తవడంతో క్వారీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఇసుక పాలసీ పాత విధానం కొనసాగిస్తుందా? లేక మార్పులు చేస్తుందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ క్రమంలో జిల్లాలో గతంలో టెండర్లు దక్కించుకున్న వారిలో కొందరు ఇసుక దందా చేస్తూ అడ్డగోలుగా అక్రమాలు చేసి జేబులు నింపుకొన్నారు. టెండర్లు దక్కించుకున్న వారు కాకుండా సబ్‌కాంట్రాక్టర్లు స్థానికంగా ఇసుక తీస్తూ నిబంధనలకు పాతరేసి, అదనపు బకెట్‌తో లారీల్లో ఇసుక నింపి తరలించారు.

అండగా ప్రజాప్రతినిధులు

గత సర్కారులో విడతల వారీగా గోదావరి తీరంలో జిల్లాలో మొత్తం 12 ఇసుక రీచ్‌లున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో మూడేళ్ల క్రితమే ఇసుక లభ్యత కొన్నింట్లో ఆగిపోయింది. కొన్ని మాత్రమే అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కొనసాగాయి. వీటిలో కొన్నిచోట్ల మాత్రం పరిమితికి మించి ఇసుక తరలించారు. ఇక కొందరు ప్రజాప్రతినిధులు ఇసుక కాంట్రాక్టర్లకు అండగా నిలవడంతో అడ్డూఅదుపులేకుండా అక్రమదందా సాగింది. కోటపల్లి మండలం కొల్లూరు గ్రామ పరిధిలో గోదావరి ఇసుకతో పాటు పట్టాభూములు, చెన్నూరు మండల పరిధి, జైపూర్ మండలం పరిధిలోనూ అక్రమాలు జరిగాయి. సామర్థ్యం మేర ఇసుక తరలించాల్సి ఉన్నప్పటికీ అంతకంటే ఎక్కువగా ఇసుక నింపుతూ కాసులు దండుకున్నారు. జైపూర్ మండలం వేలాల పరిధిలో ఓ ఇసుక రీచ్‌లో ఎన్నికల ముందు వరకు ఇష్టారీతిన తవ్వకాలు చేసి సొమ్ము చేసుకున్నట్లు సదరు కాంట్రాక్టర్‌పై ఆరోపణలున్నాయి. అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇష్టారీతిన రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ దందా కొనసాగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో అనుమతులు తీసుకుని ఇటు వైపు స్టాక్ యార్డులు చేసి నిలల్లో మాయాజాలం చేశారు. గోదావరినదిలోనే మట్టిరోడ్డు వేసి అటు నుంచి ఇటు ఇసుక రవాణా చేశారు. ఇక తవ్వకాల్లోనూ నిర్దేశిత ప్రదేశంలో కాకుండా పరిధి దాటి తవ్వారనే ఆరోపణలున్నాయి. వీటిపై గతంలోనే అనేక ఫిర్యాదులు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. అంతేకాకుండా 'సాక్షి'లోనూ పలు కథనాలు వెలువడగా, వెంటనే అధికారులు స్పందించారు. అయినా ఆ తర్వాత యథావిధిగా కార్యకలాపాలు కొనసాగాయి.

అక్రమాలపై విచారణ జరిగేనా?

గోదావరి పరిసరాలు, నది నుంచి ఎంత మేర ఇసుక తీశారు? అన్నీ నిబంధనల ప్రకారం జరిగాయా? లేదా? అనేది తేలాల్సి ఉంది. ప్రభుత్వం చాలామంది కాంట్రాక్టర్లకు కమీషన్ చెల్లించడం లేదనే కారణంతో అక్రమంగా ఇసుక తరలించారు. అంతా లైన్‌లోనే అనుమతులు అని చెబుతూ గుట్టుగా జీరో దందా చేసిన ఘటనలున్నాయి. ఇక ఓవర్‌లోడ్‌తో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో జాతీయ రహదారి 63 చాలా చోట్ల దెబ్బతిన్నది. ఓ వైపు కాంట్రాక్టర్ నుంచి రహదారి నిర్మాణ పనులు పూర్తికాక ముందే రోడ్డు ధ్వంసమవుతోంది. అంతేకాకుండా అనేకసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వాటిపై విచారణ జరిపిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇసుక దందాపై విచారణ జరిపిస్తారా? అనేది వేచి చూడాలి.

'మెగా' ఆశలు..!



మంచిర్యాల గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు (ఫైల్)

- డీఎస్సీకి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్
- 'మూత'బడుల పునఃప్రారంభానికి సై..
- భారీగా పెరగనున్న టీచర్ పోస్టులు
- హర్షం వ్యక్తంజేస్తున్న నిరుద్యోగులు
- లైబ్రరీలు, కోచింగ్ సెంటర్లకు పరుగులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు లేరంటూ మూసివేసిన పాఠశాలలు పునఃప్రారంభించాలని.. ఎంత మంది పిల్లలున్నా వాటిని నిర్వహించాలని.. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రతీ పల్లెకు సర్కారు పాఠశాల ఉండాలనే సీఎం నిర్ణయంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్ల తర్వాత ప్రకటించిన ఉపాధ్యాయ పరీక్ష ఇటీవలి శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడగా నిరుద్యోగులు నిరాశకు లోనయ్యారు. ఈ పరీక్ష కోసం గతేడాది సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. నవంబర్ 20నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల షెడ్యూల్ రావటంతో వాయిదా వేశారు. నూతన ప్రభుత్వం తాజాగా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ.. విద్యార్థులు లేరని మూసేసిన పాఠశాలలు పునఃప్రారంభించాలని నిర్ణయించడంతో ఉపాధ్యాయ ఖాళీలు పెరిగే అవకాశాలున్నాయి. దీంతో శిక్షణ కోసం నిరుద్యోగులు గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు.

ఖాళీలపై స్పష్టత వచ్చేనా?

జిల్లా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మొత్తం 473 ఖాళీలున్నాయి. గతేడాది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 113 పోస్టులు మాత్రమే ఖాళీలుగా చూపటం నిరుద్యోగులను నిరాశ పరిచింది. 473 ఖాళీలకు గాను 113 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 36, భాషా పండితుల పోస్టులు 16, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 3, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు 58 ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఖాళీలు పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాలకు..

రాష్ట్ర సర్కారు మెగా డీఎస్సీ ప్రకటన చేసిన నేపథ్యంలో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాల బాట పడుతున్నారు. దీంతో కోచింగ్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. ఎలాగైనా పోస్టు సాధించాలనే పట్టుదలతో సంసిద్ధులవుతున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 120 మంది నుంచి 300వరకు నిరుద్యోగులు పుస్తకపఠనం చేస్తున్నారు. మధ్యాహ్నం లంచ్‌బాక్స్‌లు తెచ్చుకుంటూ అక్కడే ఉదయం నుంచి పొద్దుపోయే దాకా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

తెరుచుకోనున్న 31 పాఠశాలలు

ఉపాధ్యాయులున్నా పిల్లలు లేక మూతబడిన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ప్రతీ పల్లెలోనూ పాఠశాల ఉండాలనే ప్రభుత్వ ప్రకటనతో సున్నా పాఠశాలల్లోనూ బడిగంట మోగనుంది. జిల్లాలో ఉపాధ్యాయులున్నా విద్యార్థులు లేకపోవటంతో 31 పాఠశాలలు తాత్కాలికంగా మూతబడ్డాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. దీంతో సున్నా పాఠశాలల భవనాలు కళావిహీనంగా మారాయి. కొన్నిచోట్ల ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లతో నిండిపోగా మరికొన్ని పాఠశాల భవనాలు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. హాజీపూర్ మండలం వెంపల్లి పాఠశాల భవనం ఆనవాలు లేకుండా చేసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇంకొన్ని చోట్ల పాఠశాల భవనాలు పశువుల పాకలుగా మారాయి. ఏళ్ల తరబడి మూసివేసిన సున్నా పాఠశాలల భవనాలపై అధికారులు దృష్టి సారిస్తేనే వచ్చే విద్యాసంవత్సరానికైనా పునరుద్ధరణకు వీలుంటుంది.

అర్హులకు సంక్షేమ పథకాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజాపాలన ద్వారా అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం గుడిపేట-నంనూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనకు హాజరై మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాల బాధితులకు పరిహారం పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరిగేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని, లేనిపక్షంలో బదిలీ చర్యలు తీసుకునేలా చూస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు ఎక్కువగా ఉంటే అదనపు కౌంటర్లు, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్లంపల్లి ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలతో పాటు పునరావాస కాలనీల్లో కేటాయించిన ఇంటి స్థలాల విషయంలో అవకతవకలపై విచారణ చేపడతామని తెలిపారు. నియోజకవర్గ ప్రజాపాలన ఇన్‌చార్జి, జెడ్పీ సీఈవో నరేందర్, హాజీపూర్ మండల ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీవో అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్ హరిత, విద్యుత్ రూరల్ ఏడీఈ రాజశేఖర్, గిర్దావర్లు మంగ, ప్రభు, జెడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి శిల్ప, సర్పంచులు లక్ష్మి, పద్మ, రాజేశ్వరి, సత్యం, ఎంపీటీసీ సభ్యులు ఒడ్డె బాలరాజు, డేగ బాపు పాల్గొన్నారు.

నీ చావుకు నా గ్యారంటీ..

ప్రజాపాలనలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనదైన శైలితో అందరినీ ఆకట్టుకున్నారు. వేదిక వద్దకు వచ్చిన ఓ స్థానికుడు నాకు పదేళ్ల నుంచి పెన్షన్ వస్తలేదని తెలిపాడు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ మూడు నెలల్లో నీకు పెన్షన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని అతడు 'ఈ మూడు నెలల్లో నేను చనిపోతే ఎలా' అన్నాడు. ఎమ్మెల్యే బదులిస్తూ 'నీ చావుకు నా గ్యారంటీ' అనడంతో సభాప్రాంగణంలో నవ్వులు విరిశాయి.

బెల్లంపల్లిలో నర్సింగ్ కళాశాల!

- ఇటీవల సీఎం చేసిన ప్రకటనతో ఆశలు
- ఈప్రాంత విద్యార్థినులకు ఎంతో మేలు



బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి భవనం

బెల్లంపల్లి: బెల్లంపల్లికి నర్సింగ్ కళాశాల మంజూరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రతీ వంద పడకల ఆస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని సీఎం సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో బెల్లంపల్లి వందపడకల ప్రభుత్వ ఏరియాస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటయ్యేందుకు అనువైన పరిస్థితులు మెండుగా ఉన్నాయి. ఇన్నాళ్లుగా మరుగునపడిన అంశం కొత్త చిగురు తొడగబోతోందనే సంతోషం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా బెల్లంపల్లి కేంద్రంగా నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలనే డిమాండ్ ఉన్నా ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన బెల్లంపల్లివాసుల్లో ఆనందం వెల్లివిరిసేలా చేసింది.

ప్రభుత్వ ఏరియాస్పత్రికి తోడుగా..

వందపడకల ప్రభుత్వ ఏరియాస్పత్రికి తోడుగా సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో 36 ఏళ్లుగా బెల్లంపల్లిలో సింగరేణి ఏరియా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందించడం కోసం 1987లో 280 పడకల సామర్థ్యంతో దీనిని ప్రారంభించారు. ఇది నిరంతరంగా సింగరేణీయులకు వైద్యసేవలు అందిస్తోంది. దీంతో ఏ కోణాన చూసిన బెల్లంపల్లిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉండగా సీఎం ప్రకటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

గ్రామీణ విద్యార్థినులకు వరం..

ఎక్కువ మంది గ్రామీణ ప్రాంత బాలికలు ఇంటర్, డిగ్రీ వరకే చదువు కొనసాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి రీత్యా ఉన్నత చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. చదువుకున్నంతలోనే ఏదైనా ఉద్యోగం సంపాదించాలనే లక్ష్యంతో సరిపెట్టుకుంటున్నారు. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ), నర్సింగ్ చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే నర్సింగ్ కళాశాల అందుబాటులో లేకే ఇంటర్‌తో బాలికలు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో చేరుతున్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, తాండూర్, నెన్నెల కేజీబీవీల్లో ఈ కోర్సులు ఉన్నాయి. కాగా, నర్సింగ్ కళాశాల లేక విద్యార్థినులు ఎంపీహెచ్‌డబ్ల్యూతోనే సరిపెట్టుకుంటున్నారు. బెల్లంపల్లికి నర్సింగ్ కళాశాల మంజూరైతే వారికి ఎంతగానో ఉపయోగపడనుంది.

30తో కొనసాగి 100 పడకలకు చేరి..

బెల్లంపల్లి కేంద్రంగా వందపడకల ప్రభుత్వ ఏరియాస్పత్రి కొనసాగుతోంది. ఆధునికంగా ఆస్పత్రి భవనం నిర్మించి 2022లో వందపడకల ఆస్పత్రిని అమల్లోకి తెచ్చారు. అంతకు ముందు వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో ఐదు దశాబ్దాల క్రితం 30 పడకల సామర్థ్యంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మంజూరైంది. రోగుల తాకిడి అధికంగా ఉండటంతో 2001లో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను వందపడకలకు అప్‌గ్రేడ్ చేసి ఏరియాస్పత్రిని నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కలున్న దాదాపు తొమ్మిది మండలాలకు బెల్లంపల్లి కేంద్రంగా ఉంది. ఏ అవసరాలకైనా గ్రామీణులు బెల్లంపల్లికి రాక తప్పదు. అందులో ముఖ్యంగా వైద్యసేవల కోసం పేదలు, అట్టడుగు వర్గాల ప్రజలు ప్రభుత్వాస్పత్రిపై ఆధారపడక తప్పడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రికి రోజువారీగా 300నుంచి 350మంది వరకు అవుట్‌పేషెంట్లు వస్తుండగా, 70మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. వీరికి అదనంగా మరో 20మంది వరకు గర్భిణులు ప్రసవం కోసం ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నియోజకవర్గ ప్రజలు ఎప్పటినుంచో భావిస్తున్నారు.


కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తా




సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియాస్పత్రికి అనుబంధంగా తప్పకుండా నర్సింగ్ కళాశాల మంజూరు కావాల్సి ఉంది. ఈ అంశాన్ని నేను కూడా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గట్టిగా ప్రయత్నం చేస్తా. ఈ ప్రాంత బాలికల ఆశలు నెరవేర్చడానికి కృషి చేస్తా.

– గడ్డం వినోద్, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

కలెక్టర్, డీసీపీని కలిసిన బెటాలియన్ అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమాండెంట్, అధికారులు



డీసీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ అధికారులు మంగళవారం కలెక్టర్ బాదావత్ సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్, డీసీపీని కలిసిన వారిలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా, అసిస్టెంట్ కమాండెంట్లు రఘునాథ్‌చౌహాన్, శరత్‌కుమార్, ఆర్‌ఐలు కుమారస్వామి, ఆర్‌ఎస్సై శేఖర్ ఉన్నారు.

నిరంతరం మిషన్ భగీరథ నీరు



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: మిషన్ భగీరథ ద్వారా నిరంతరంగా శుద్ధమైన తాగునీరు సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ బీ సంతోష్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఆర్డీవో రాములుతో కలిసి మిషన్ భగీరథ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 14న నస్పూర్, మంచిర్యాల, లక్సెట్టిపేట మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులకు నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో అంతరాయం లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీలోని 7, 11, 12, 14, 15, 17, 18, 19 వార్డుల్లో దాదాపు 15వేల నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నస్పూర్‌లో సింగరేణి సహకారంతో తడి, పొడి చెత్త వేసేందుకు డంప్‌యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని, యార్డులో ఆధునిక పద్ధతిలో విభాగాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విధులను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మేకల మందపై చిరుతపులి దాడి

కోటపల్లి: మండలంలోని పిన్నారం అటవీ ప్రాంతంలో మేకల మందపై చిరుతపులి దాడి చేసి మేకపిల్లను గాయపర్చింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాపరి గడ్డం అంకయ్య మంగళవారం మేకలను తోలుకుని శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. చిరుతపులి ఒక్కసారిగా మందపై దాడి చేసి మేకపిల్లను గాయపర్చింది. అంకయ్య గట్టిగా కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. చిరుత సంచారంపై ఫారెస్టు అధికారులు నిఘా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తిర్యాణి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం శివారులోని పాత సమ్మక్క గద్దెల ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన కోట్నాక గణపతి, గిన్నెదరి గ్రామానికి చెందిన మడావి బోజ్జిరావు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారి వద్ద తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి దొరికింది. ఈ మేరకు డెప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ సమక్షంలో పంచనామా నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో సీఐటీయూ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మైనింగ్ సిబ్బంది

శ్రీరాంపూర్: మందమర్రి ఏరియాలోని కేకే 5 గని ఓవర్‌మెన్ టీ.చంద్రశేఖర్‌ను అక్రమంగా బదిలీ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్కే 7 గనిపై మైనింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బదిలీని రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బాలాజీ, పిట్ సెక్రెటరీ శ్రీధర్, నాయకులు అనిల్, రాకేశ్, ప్రవీణ్, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలిమంటలు అంటుకుని వివాహిత మృతి

తిర్యాణి: చలి కాగేందుకు వేసుకున్న మంటలు అంటుకుని వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని సాలేగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిన్నెదరి పంచాయతీ పరిధిలోని సాలేగూడకు చెందిన దేవేంద్ర (31)కు ఆర్నెళ్ల క్రితం గుండాలకు చెందిన కుడిమెత నాగేశ్‌తో వివాహమైంది. రెండు నెలలుగా దేవేంద్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఇంటిముందు చలిమంట కాగుతుండగా ప్రమాదశాత్తు ఆమె నైటీకి మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి మర్సుకోల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ అక్రమ దందాకు చెక్


దండేపల్లి మండలం లింగాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

- అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఐపీఎస్ అధికారికి పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు
- అక్రమ రవాణాదారులపై పీడీయాక్ట్

మంచిర్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చేందుకు పౌర సరఫరాల శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. తినడానికి యోగ్యంగా లేకపోవడంతో వాటిని అధిక ధరలకు అమ్ముకుని సన్నబియ్యం కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన దళారులు, కొందరు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి బియ్యం తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు, రైస్‌మిల్లులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రైస్ మిల్లర్ల యజమానులు అట్టి బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్‌గా సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ దందా రాష్ట్ర వ్యాప్తంగా యథేచ్ఛగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ దందాకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టింది.

అట్నుంచి అటే...

గతంలో దళారులు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 వరకు వెచ్చించి రేషన్ బియ్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రేషన్ డీలర్లు సైతం బియ్యం కొనుగోలు చేయడం ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులు బియ్యాన్ని ఇంటివరకు తెచ్చుకోకుండా అట్నుంచి అటే రేషన్ డీలర్లకు అమ్మేస్తున్నారు. దీంతో రేషన్ డీలర్లు అనధికార నగదు బదిలీ దందాకు తెరలేపారు. రేషన్ దుకాణం తెరవగానే లబ్ధిదారులు వెళ్లి వేలిముద్రలు వేయడం .. నగదు తీసుకుని ఇంటికి రావడం పరిపాటిగా మారింది. కొంతమంది దళారులు రేషన్ షాపుల వద్దే పడిగాపులు కాస్తూ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనేందుకు పోటీపడుతున్నారు. ఈ తతంగంపై పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి...

రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గతంలో ఎఫ్‌సీఐలో పనిచేసిన అనుభవం ఉన్న ఐపీఎస్ సీనియర్ పోలీస్ అధికారి డీఎస్.చౌహాన్‌ను పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. పీడీఎస్ రైస్ అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇక పేదల బియ్యం పక్కదారి పట్టకుండా బ్రేక్ పడనుంది.

అక్రమ రవాణా ఇలా...

రేషన్ బియ్యం సేకరించిన వ్యాపారులు, కొంతమంది రేషన్ డీలర్లు సైతం ఆటోలు, డీసీఎంలు, లారీల్లో రేషన్ బియ్యాన్ని మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో రైలుమార్గం గుండా భాగ్యనగర్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లో రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రలోని వీరుర్‌కు తరలించేవారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని సిరొంచాకు తరలిస్తున్నారు. జగ్దల్‌పూర్ నేషనల్ హైవే మార్గంలో సిరొంచా సమీపంలో గోదావరినదిపై కాళేశ్వరం బ్రిడ్జి నిర్మించడంతో రాత్రి, పగలు తేడాలేకుండా యథేచ్ఛగా బియ్యం తరలిస్తున్నారు. కాళేశ్వరం బ్రిడ్జి సమీపంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినా అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు మాములుగా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

అక్రమ రవాణాదారులపై పీడీయాక్ట్



రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తాం. రేషన్ అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. కమిషనరేట్ పరిధిలో ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలి.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

నిలిచిన పాదయాత్రలు..


నస్పూర్ కాలనీలో కూలిన డ్రెయినేజీ

- మూగబోయిన 'డయల్ యువర్ జీఎం'
- అపరిష్కృతంగా కాలనీ సమస్యలు
- కొత్త గుర్తింపు సంఘమైనా చొరవ చూపేనా?

శ్రీరాంపూర్: కాలనీల్లో నివాసం ఉంటున్న కార్మిక కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జీఎం పాదయాత్రలు మూడేళ్లుగా నిలిచిపోయాయి. కంపెనీలోని అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌తో పాటు అన్ని ఏరియాల్లో పాదయాత్రలు నిర్వహించడంలేదు. కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు పదిహేనేళ్ల క్రితం పాదయాత్రల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కానీ కరోనాకు కొన్ని నెలల ముందే వాటిని నిలిపివేశారు. దీంతో కాలనీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం కార్మికులు ఉంటున్న క్వార్టర్లు ఏళ్లక్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురిస్తే పైకప్పు ఉరుస్తోంది. తలుపులు, కిటికీలు ఊడిపోవడం, విద్యుత్, తాగు నీటి సమస్యలు అనేక ఉత్పన్నం అవుతున్నాయి. సమస్యల పరిష్కారం కోసం ఆయా డిపార్టుమెంట్ల కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరగాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. అంతేకాకుండా కాలనీలోని మెయిన్ డ్రెయినేజీలు చిన్నపాటి వర్షానికే నిండిపోవడంతో క్వార్టర్లలో నీళ్లు నిలిచి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లతో సెప్టిక్ ట్యాంక్ కుండీలు పగిలి దుర్గంధం వెదజల్లుతోంది. వాహనాల పార్కింగ్, వీధి దీపాలు, పార్కులు, మైదానాల్లో ఎదురవుతున్న సమస్యలకు ఈ పాదయాత్రలే చక్కని పరిష్కార వేదిక అని, ప్రస్తుతం అవి లేకపోవడంతో సమస్యలు పరిష్కారంకాక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి. అధికారులు పాదయాత్రలు చేపడితే వీటిని స్వయంగా పరిశీలించి యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు.

ఉన్న అవకాశం పోయింది

పాదయాత్రలు నిలిపివేసిన తర్వాత అధికారులు కొద్ది నెలలు ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ జీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల 1వ తేదిన ఉదయం 11 గంటలకు కార్మికులే నేరుగా జీఎంకు ఫోన్‌చేసి తమ సమస్యలను చెప్పుకునే వారు. దీంతో కొన్నయినా పరిష్కారం అయ్యేవి. ఇప్పుడు వాటిని కూడా నిలిపివేయడంతో ఉన్న ఒక్క అవకాశం కూడా పోయిందని కార్మికులు పేర్కొంటున్నారు. ఇటీవల గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ నాయకులైనా ఈ కార్యక్రమాలను పునరుద్ధరణ చేస్తారో.. లేదో వేచిచూడాలి.

వెంటనే పునరుద్ధరించాలి

పాదయాత్రలు, డయల్ యువర్ జీఎం కార్యక్రమాలు లేకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే వీటిని పునరుద్ధరించాలి. ఈ విషయమై సంస్థ యాజమాన్యాన్ని కలిసి విన్నవిస్తాం.

– ఎస్కే బాజీసైదా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

సింగరేణి సీఎండీగా ఎన్.బలరాం

- పలువురు నేతల అభినందనలు

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీగా డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాంను నియమించారు. సీఎండీగా ఉన్న ఎన్.శ్రీధర్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఐఆర్ఎస్ అధికారి అయిన కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న ఎన్.బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే.రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య హైదరాబాద్‌లోని కంపెనీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బలరాంను కలిసిన జనక్‌ప్రసాద్

ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ కూడా బలరాంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, గరిగే స్వామి, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.


బలరాంను అభినందిస్తున్న సీతారామయ్య

టీబీజీకేఎస్ నాయకుల హర్షం

సింగరేణి సీఎండీగా బలరాం నియామకంపై టీబీజీకేఎస్ బ్రాంచి నాయకులు పెట్టం లక్ష్మణ్, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, రత్నాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల పక్షాన ఉంటాం

శ్రీరాంపూర్: గెలుపోటములతో సంబంధం లేకుండా ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటూ సేవ చేస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో ఆర్కే 5 గనిపై భరోసా యాత్ర పేరుతో కార్మికులను కలిసి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యంతో చర్చిస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, గరిగే స్వామి, నాయకులు ఆకుల రాజన్న, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, భీం రవి, నర్సింగ్, సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

భైరవస్వామి జయంత్యుత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


కోటపల్లి: గోదావరి పరీవాహక ప్రాంతం.. ఆకాశాన్ని తాకుతున్నట్లు కనిపించే గుట్టలు.. ప్రకృతి అందాల నడుమ వెలసిన భైరవస్వామి భక్తులకు దర్శనమిస్తున్నాడు. కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామంలోని కొండపై కొలువుదీరిన భైరవస్వామి జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిసర గ్రామాల ప్రజలు ముందుగా స్వామివారిని దర్శించుకున్న తర్వాతనే తమ ఇళ్లలో శుభకార్యాలు ప్రారంభిస్తారు. ఈ నెల 4న భైరవజయంతి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా భక్తుల రద్దీ పెరుగుతుండడంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు కోటపల్లితో పాటు చెన్నూర్, వేమనపల్లి, గోదావరిఖని, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.


కొండపై వెలిసిన భైరవస్వామి

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

4న ఉదయం 9:30 గంటలకు స్వామివారి అభిషేకం, సింధూరం లేపనం, వస్త్రాలంకరణ, పుష్పార్చన, మంగళహారతి, నైవేద్యం సమర్పణ, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం, 7:30 గంటలకు మంగళహారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


పండుగలా జరుపుకుంటాం



గ్రామంలోని ఏ ఇంట శుభకార్యం జరిగినా ముందుగా భైరవస్వామిని దర్శించుకుంటారు. ఏటా భైరవ స్వామి జయంతి వేడుకలను గ్రామస్తులం అంతా కలిసి పండుగలా జరుపుకుంటాం.

– రామకృష్ణ, గ్రామస్తుడు

కొండను అభివృద్ధి చేయాలి



భైరవ కొండను అభివృద్ధి చేసి పార్‌పల్లికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి. వందల ఏళ్ల చరిత్ర కల్గిన భైరవ కొండను దేవాదాయశాఖ గుర్తించి పర్యాటకంగా తీర్చిదిద్దాలి. గుట్ట వద్ద ఆలయాన్ని నిర్మించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– రాజేశ్, భక్తుడు

హత్య కేసులో నిందితుల రిమాండ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన ఆకుదారి సంపత్ హత్య కేసులో నిందితులు పంది మహేష్, వీరబోయిన సతీష్, అలుగునూరి అరుణ్‌కుమార్‌లను మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్ అరెస్టు చేశారు. చెన్నూర్‌లోని కోర్టులో జడ్జి ఎదుట నిందితులను ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపారు.

- నోటిఫికేషన్ వేసి నెలలు గడుస్తున్నా ఎంపికలో జాప్యం
- కార్మికులకు తప్పని ఎదురుచూపులు

సీఎస్ఎల్ పోస్టుల భర్తీ ఎప్పుడో?

కాసిపేట: మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న సీఎస్ఎల్(చార్జ్ సేఫ్టీ ల్యాంప్)పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నెలలు కావస్తున్నా నియామకాలు చేపట్టకపోవడంతో దరఖాస్తు చేసుకున్న కార్మికులకు ఎదురుచూపులు తప్పడంలేదు. మిగతా ఏరియాల్లో నియామకాలు పూర్తి చేసిన అధికారులు మందమర్రి ఏరియాను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గనులపై ల్యాంప్ రూంలలో విధులు నిర్వహించేందుకు ఏరియాలో ఐదు పోస్టులు ఖాళీగా ఉండగా ఎనిమిది నెలల క్రితం యాజమాన్యం అంతర్గత నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అర్హత ఉన్న 18 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టుకు జాతీయస్థాయిలో నిర్వహించే గ్యాస్ టెస్ట్(జీటీ)సర్టిఫికెట్ తప్పనిసరి. కానీ అంతకుముందు ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎక్కువ మందికి తెలియక దరఖాస్తు చేసుకోకపోవడంతో చేసిన వారికి అందరికి ఇచ్చారు. తిరిగి మళ్లీ నోటిఫికేషన్ వేయడంతో కార్మికుల నుంచి స్పందన వచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

సర్దార్‌లు, ఓవర్‌మెన్‌ల దరఖాస్తులతో ఇబ్బందులు

సీఎస్ఎల్ పోస్టుకు సంబంధించి గ్యాస్ టెస్ట్ సర్టిఫికెట్ అవసరం. సర్దార్‌లు, ఓవర్‌మెన్‌లు, ఆపై స్థాయి అధికారులు మాత్రమే జీటీ సర్టిఫికెట్ కలిగి ఉంటారు. ఈ క్రమంలో నోటిఫికేషన్ వెలువడడంతో సర్టిఫికెట్ ఉన్న సర్దార్‌లు, ఓవర్‌మెన్‌లు సైతం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సూపర్‌వైజర్ స్థాయి అర్హత కలిగిన వీరికి ఆ పోస్టులు కేటాయిస్తే సంస్థకు నష్టం రావడంతో పాటు శిక్షణ అనుభవం ఉన్న సూపర్‌వైజర్ సేవలు దూరం అవుతాయని గమనించి వారి దరఖాస్తులు పరిగణలోకి తీసుకోకుండా ప్రయత్నాలు చేశారు. దానికి తోడు గ్యాస్ టెస్టింగ్ పరీక్షకు కొందరు సిద్ధంకావడంతో నాయకుల ఒత్తిడితో కాలంగడుపుతూ వచ్చారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం పరీక్ష ముగియడంతో మళ్లీ నోటిఫికేషన్ వేసేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. ఈక్రమంలో మొదట దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు అన్యాయం జరుగుతుందని, మళ్లీ నోటిఫికేషన్ వేయకుండా పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయాలని కోరుతున్నారు. పరీక్ష నిర్వహణకు హాల్‌టికెట్లు సైతం సిద్ధం చేసి తేదీ ఖరారు చేయాల్సి ఉండగా అధికారులు జాప్యం చేస్తూ వచ్చారని, వెంటనే నియామకాలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం కావడంతో హాల్‌టికెట్లు జారీ చేయలేదన్నారు. పాలసీ మ్యాటర్ అయినందున కార్పోరేట్‌కు పంపించామని, త్వరలోనే పోస్టులకు సంబంధించి కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


కార్మికులు (ఫైల్)

సీఎంను కలిసిన సీపీఐ నాయకులు


సీఎంతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం సీపీఐ నాయకులు సచివాలయంలో కలిసి అసంఘటిత రంగాల కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 32వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ నీలి కృష్ణ, 28వ వార్డు కౌన్సిలర్ కేమశెట్టి సరిత భర్త శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో గడ్డం అశోక్ కూడా ఉన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు మొదలయ్యాయి.

ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ

- కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీసీఈవో నరేందర్, బెల్లంపల్లి, ఆర్డీవో హరికృష్ణ, చెన్నూర్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సిడాం దత్తులతో కలిసి ప్రత్యేక అధికారులతో కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6 వరకు ప్రతీరోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి దరఖాస్తులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డివిజన్ పంచాయతీ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి

- ఏసీపీ వెంకటేశ్వర్లు

మంచిర్యాలక్రైం: బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి, ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వం బాల కార్మిక నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో జిల్లా పోలీస్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని, దాన్ని అనుభవించడం ప్రతీ పౌరుని హక్కు అన్నారు. కొందరు వ్యాపారులు బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 1 నుంచి 31వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆపరేషన్ స్మైల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

'సావిత్రిబాయి పూలేకు భారతరత్న ప్రకటించాలి'

పాతమంచిర్యాల: సావిత్రిబాయి పూలేకు భారతరత్న అవార్డు ప్రకటించాలని కోరుతూ బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మంగళవారం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు చదువు నేర్పించడంలో ఆమె ఎన్నో ఆటుపోట్లు, అవమానాలు ఎదుర్కొందన్నారు. సమాజానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపతి రాములు, ఆరెందుల రాజేశం, అంకం సతీశ్, మిట్టపల్లి రాజశేఖర్, ముడుసు అనిల్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు